www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 2 ఏప్రిల్ 2023

5

అన్నమయ్య

చలో ఢిల్లీకి బయలుదేరిన శ్రామికవర్గం

మదనపల్లె అర్బన్: బిజెపి అనుసరిస్తున్న ప్రజా కంటక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న జరిగే పార్లమెంటు మార్చ్ కార్యక్రమానికి అన్నమయ్య జిల్లా నుంచి శ్రామికవర్గం బయలుదేరింది. శనివారం సాయంత్రం స్థానిక సిటిఎం రైల్వేస్టేషన్‌లో రైలు ఎక్కారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.శ్రీనివాసులు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అంబానీ, అదానీల కోసం శ్రామిక ప్రజలను దోపిడీ చేస్తోందని విమర్శించారు. దేశం అంటే అదానీ, అంబానీ అన్నట్లుగా బిజెపి వ్యవహారం ఉందని ఆగ్రహం వ్యక్తంచేశారు. కార్మిక హక్కుల పరిరక్షణ, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ, దేశాన్ని కాపాడుకోవడం లక్ష్యంతో బిజెపి గద్దెదించాలని జరుగుతున్న చలో ఢిల్లీ కార్యక్రమం జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఢిల్లీకి బయలుదేరిన కార్మికులు

బోగస్..బోగస్!

- స్టాఫ్ నర్సుల భర్తీలో బోగస్ మార్కులే
- తాజాగా మరో ఏడుగురు వెలుగులోకి
- మార్కుల మాఫియాపై విచారణ ఏదీ?
- నిద్రావస్థలో రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ

స్టాఫ్ నర్సుల భర్తీ బాగోతం సీరియల్‌ను తలపిస్తోంది. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ కింద కడప రీజినల్ డైరెక్టర్ కార్యాలయ యంత్రాంగం పెద్దఎత్తున నర్సింగ్ పోస్టులను భర్తీ చేసింది. చిత్తూరు జిల్లా కేంద్రంగా ఓ గ్యాంగ్ దరఖాస్తుదారుల ఒరిజినల్ మార్కులిస్టుల్లోని మార్కులను హైప్ చేసి బోగస్ మార్కులుగా మార్చి అనర్హులకు ఉద్యోగాలు దక్కేలా చేసిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చిత్తూరు జిల్లా కేంద్రంగా వచ్చిన ఫిర్యాదు ఆధారంగా వైఎస్ఆర్ హెల్త్ యూనివర్శిటీ గత నెల 14న ఎనిమిది మంది ఒరిజినల్ మార్కులిస్టులను పరిశీలించి బోగస్ మార్కులుగా నిర్ధారించి పంపించింది. తాజాగా మరోసారి ఏడుగురికి బోగస్ మార్కులతో ఉద్యోగాలు లభించినట్లు తేలడం చర్చనీయాంశంగా మారింది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ 2022 నవంబర్‌లో 957 స్టాఫ్‌నర్స్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసింది. జోన్-4 కేటగిరీ కింద 291 స్టాఫ్‌నర్స్ పోస్టులను కేటాయించింది. జిల్లాలోని ఆర్‌డి కార్యాలయం 2023 జనవరిలో స్టాఫ్‌నర్స్ పోస్టులను భర్తీ చేసింది. గైడ్‌లెన్స్ ప్రకారం రిక్రూట్‌మెంట్ చేపట్టకపోవడంతో పెద్దఎత్తున విమర్శలు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే. స్టాఫ్‌నర్స్ దరఖాస్తులు, కోవిడ్ సేవల సీనియారిటీ పత్రాలు పరిశీలనలో నిర్లక్ష్యం మొదలుకుని బోగస్ మార్కులు, ఫేక్ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందినట్లు సమాచారం. చిత్తూరు జిల్లాకు చెందిన ఓ దరఖాస్తుదారు రిక్రూట్‌మెంట్‌లో మార్కుల ఆధారంగా ఉద్యోగాలు పొందడంపై అనుమానం రావడంతో చేసిన ఫిర్యాదు ఆధారంగా డొంకంతా కదిలింది. రాజధాని కేంద్రంలోని వైఎస్ఆర్ హెల్త్ యూనివర్శిటీ 44 అనుమానిత దరఖాస్తుల్లో 15 దరఖాస్తులను పరిశీలించినట్లు సమాచారం. వీటిలో మొదటి విడత కింద ఎనిమిది మంది మార్కులను బోగస్ మార్కులుగా నిర్ధారించడం తెలిసిందే. తాజాగా రెండవ విడత కింద మరో ఏడుగురు బోగస్ మార్కులతో ఉద్యోగాలు పొందినట్లు తేల్చినట్లు సమాచారం. గత నెలలో బయటపడిన బోగస్ మార్కుల ఆధారంగా ఉద్యోగాలు పొందిన వారు చిత్తూరు వైద్య విధాన పరిషత్ పరిధిలో ఆరుగురు, ఆర్‌డి కార్యాలయ పరిధిలో ఉద్యోగాలు పొందిన ఇద్దరు, ఒకరు ఉద్యోగంలో చేరాల్సి ఉన్నట్లు తేలిన సంగతి తెలిసిందే. తాజాగా ఏడుగురు బోగస్‌మార్కుల ద్వారా పొందడం విమర్శలకు ఆస్కారం కలిగిస్తోంది. వీరి మార్కుల వివరాలను మాత్రమే వైఎస్ఆర్ హెల్త్ యూనివర్శిటీ తెలిపినట్లు సమాచారం. పూర్తి వివరాలతో కూడిన సమాచారం ఇవ్వాలని ఆర్‌డి కార్యాలయం కోరింది. పూర్తి సమాచారం అందిన అనంతరం ఏడుగురికి షోకాజ్ నోటీసులు జారీ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో చోటు చేసుకున్న ఇటువంటి ఘటనలో కేసు నమోదు చేసి, సూపరింటెండెంట్‌ను సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. తాజా ఉదంతంలో ఇటువంటి దిశగా ఆలోచనలు చేయక పోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ సిఐడి దర్యాప్తునకు ఆదేశించాలనే డిమాండ్ ఉద్యోగ, కార్మిక సంఘాల నుంచి వినిపిస్తోంది.

మరో ఏడుగురు వాస్తవమే

స్టాఫ్‌నర్సు రిక్రూట్‌మెంట్‌లో మరో ఏడుగురు బోగస్ మార్కుల ద్వారా ఉద్యోగాలు పొందినట్లు సమాచారం అందింది. వైఎస్ఆర్ హెల్త్ యూనివర్శిటీ నుంచి పూర్తిస్థాయి సమాచారం అందాల్సి ఉంది. అనంతరం బోగస్ మార్కుల బాగోతంపై దృష్టి సారిస్తామని పేర్కొనడం గమనార్హం.

- డాక్టర్ కోటేశ్వరి, రీజినల్ డైరెక్టర్, కడప.

హంస వాహనంపై సీతారాముడు



హంస వాహనంపై ఊరేగిన శ్రీసీతారాముడు

ప్రజాశక్తి -ఒంటిమిట్ట

ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం రాత్రి శ్రీ సీతాలక్ష్మణ సమేత శ్రీరాముడు భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి 7 గంటలకు వాహనసేవ ప్రారంభమై రాత్రి 9 గంటల వరకు వాహనసేవ జరిగింది. భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూ రహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం ఎనిమిది గంటలకు స్వామివారు వేణుగాన అలంకారంలో ఆలయ నాలుగు మాడ వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు ఉద యం 8 గంటల నుండి స్వామివారి ఊరేగింపు వైభవంగా జరిగింది. భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళ వాయిద్యాల నడుమ స్వామి వారి ఊరేగింపు కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగ డుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం 11 నుండి 12 గంటల వరకు ఆలయంలో స్నపనతిరుమంజనం వేడుకగా నిర్వహిం చనున్నారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, చందనంతో స్వామి, అమ్మవార్లకు అభిషేకం చేశారు. సాయంత్రం 5 గంటల నుండి 6 గంటల వరకు ఊంజల్‌సేవ వైభవంగా జరగనుంది. కార్యక్ర మంలో ఆలయ డెప్యూటీ ఇఒ నటేష్ బాబు, ఎఇఒ గోపాలరావు, సూపరింటెండెంట్లు పి.వెంకటేశయ్య, ఆర్సీ సుబ్రహ్మణ్యం, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనంజయ, జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

అలరించిన కళాకారుల కోలాటం

అలరించిన చిన్నారుల కోలాటం

బాలామృతం ప్యాకెట్ ఇస్తున్న ఐసిడిఎస్ డైరెక్టర్ రవిచంద్రారెడ్డి

అంగన్వాడీలతోనే మాతాశిశు సంరక్షణ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మాతా శిశు సంరక్షణ అంగన్వాడీ కేంద్రాలతోనే సాధ్యమవుతోందని, అలాంటి అంగన్వాడీ కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని మాతా శిశు సంరక్షణ శాఖ ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ రవిచంద్రారెడ్డి అన్నారు. శనివారం ఆయన రాజంపేట ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని బోయినపల్లి, తాళ్లపాక అంగన్వాడీ కేంద్రాలను సందర్శించారు. అక్కడ గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాశన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైయస్సార్ సంపూర్ణ పోషణ, బాలామృతం వాటి విశిష్టతలను వివరించారు. అనంతరం హేమాద్రిపల్లె అంగన్వాడీ కార్యకర్త పదవీ విరమణ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సిడిపిఒ నిర్మల, బోయినపల్లి సూపర్వైజర్ పార్వతమ్మ, ప్రాజెక్ట్ అసిస్టెంట్ రమేష్, అంగన్వాడీ కార్యకర్తలు రాజేశ్వరమ్మ, నాగ సులోచన, రేవతి, కృష్ణవేణి, వెంకటసుబ్బమ్మ పాల్గొన్నారు.

బాలిక కుటుంబానికి న్యాయం చేస్తాం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పెద్దతిప్పసముద్రం మండలం కందుకూరులో ఓ కామాంధుడి వలలో చిక్కుకుని ఓ బాలిక గర్భందాల్చి మగ బిడ్డకు జన్మనిచ్చిన సంఘటన శుక్రవారం జరిగిన సంగతి విదితమే. బి.కొత్తకోట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలికను ములకలచెరువు సిఐ సాదిక్ అలీ, ఎస్ఐ మధురామచంద్రుడు శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ నిందితుడిని కఠినంగా శిక్షించి బాలిక కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. నిరుపేద అయిన బాలికను మాయమాటలతో నమ్మించి మోసం చేసిన నరసింహులపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు.

సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

శనివారం జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి తన ఎస్టేట్‌లో సిఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఎగువగడ్డవీధికి చెందిన పచ్చిపులుసు బాలాజీకి రూ.80 వేలు, కడప నగరం ఆర్టీసీ కాలనీకి చెందిన మీసాల జయమ్మకు రూ.60 వేలు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆకేపాటి మాట్లాడుతూ ఆపత్కాలంలో ఉన్నవారికి సిఎం సహాయ నిధి ఒక వరమని తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు పెంచలయ్య నాయుడు, నవీన్, కళ్యాణ్ రెడ్డి, ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు నెరవేర్చే వ్యక్తి జగన్ : ఎంపీ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

జగనన్న మాటలు చెప్పే వ్యక్తి కాదనీ, చేతల్లో చూపించేవి వ్యక్తని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని, జడ్పీ హైస్కూల్, బైపాస్ రోడ్‌లోని ఓ ఫంక్షన్ హాల్లో వైయస్సార్ మూడో విడత ఆసరా చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నో ఇబ్బందులు ఉన్నా ఎదుర్కొని జగనన్న మాట చెప్పాడంటే కచ్చితంగా చేసి తీరుతాడని ఇందుకు నిదర్శనం ఈ నాలుగేళ్ల పాలననే ఉదాహరణలని పేర్కొన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు కేవలం మాటలు చెప్పే వ్యక్తిని ఆయన పరిపాలనకు ప్రస్తుత నాలుగు సంవత్సరాల జగనన్న పరిపాలనకు ఎంతో వ్యత్యాసం ఉందని ఇది ప్రజలు గుర్తించారన్నారు. శాసనసభ్యులు నవాజ్‌బాష మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ప్రజల కోసం ఏర్పాటుచేసిన సంక్షేమ పథకాలైన అమ్మ ఒడి ఆసరా చేయూత ఫీజు రీయంబర్స్మెంట్ యూనిఫామ్, వంటి కార్యక్రమాలను చేపట్టడం ప్రజలందరూ చూశారన్నారు. కార్యక్రమంలో ఎపిఎండిసి చైర్‌పర్సన్ జి.సమీమస్లాం, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజరెడ్డి, వైస్ చైర్మన్లు జింక వెంకటాచలపతి, నూర్ ఆజాం, ఎంపిపి రెడ్డమ్మ, ఎంపిడిఒ తాజ్ మస్రోర్, కౌన్సిలర్లు, సర్పంచులు, నాయకులు ఉదయ్ కుమార్, వెలుగు చంద్ర, ప్రజలు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు చెక్ అందజేస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి

పేదలందరికీ సంక్షేమ పథకాలు : 'గడికోట'

ప్రజాశక్తి-రాయచోటి

జగన్ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు పేదలందరికీ అందిస్తున్నామని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం సంబేపల్లె మండలం గుణ్ణికుంట్ల-2 సచివాలయ పరిధిలో గురిగింజకుంటలో డిసిఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపిపి ఆవుల నాగశ్రీ లక్ష్మీ, జడ్‌పిటిసి గొర్ల కవిత, సర్పంచుల సంఘ జిల్లా అధ్యక్షుడు చిదంబర్‌రెడ్డి, మాజీ జడ్‌పిటిసి గొర్ల ఉపేంద్రారెడ్డి, గొర్ల రమేశ్‌రెడ్డి, సర్పంచ్ రఘునాథరెడ్డి, ఎంపిటిసి శ్రీధర్‌రెడ్డి, అన్నారెడ్డిలతో కలసి కాల్వవాండ్లపల్లె, వంకవారిపల్లె, మాలపల్లె, మొరంక్రిందపల్లెలలో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ జగన్ పాలనలో అర్హతే ఆధారంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి లబ్ధిదారుల సంఖ్య లక్షల్లో తేడా ఉందన్నారు. గత ప్రభుత్వంలో ఎక్కువగా పథకాలు ఉండేవి కావని, ఇచ్చే అరకొర పథకాలలోనే ఎలా కత్తిరించాలో చూసేవారన్నారు. ఆ ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి ఎంతో తేడావుందన్నారు. దేశచరిత్రలో ఎన్నడూ లేనివిధంగా విన్నూత్నంగా ఏడాదిలో ఏయే మాసంలో ఏయే సంక్షేమ పథకాలు అందిస్తామో తెలిపే సంక్షేమ కేలండర్‌ను సిఎం జగన్ అమలు చేస్తున్నారన్నారు. సంక్షేమ క్యాలెండర్‌లో ఇచ్చిన షెడ్యూల్‌ను ఎక్కడా తప్పకుండా అమలు చేయడంలో దేశంలోనే సిఎం జగన్ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాల క్యాలెండర్ పేదవర్గాలకు వెల్ఫేర్ కేలండర్ అని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్ చెప్పారంటే చేస్తారు అనే నమ్మకం ప్రజల మనసుల్లో నిలిచిపోయిందన్నారు. కార్యక్రమంలో అమరనాథరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మహేష్

కేసులను కప్పిపుచ్చుకునేందుకే జగన్ ఢిల్లీ పర్యటనలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిపై ఉన్న కేసులను కప్పి పుచ్చుకునేందుకే వరుస ఢిల్లీ పర్యటనలు చేస్తున్నారని జనసేన నాయకులు డాక్టర్ మైఫోర్స్ మహేష్ అన్నారు. శనివారం పట్టణంలోని గొల్లపల్లి జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేసులు మాఫీ చేసుకునేందుకు ఢిల్లీ పర్యటనలు తప్ప రాష్ట్రానికి రావలసిన ప్రత్యేక హోదా అడిగిన పాపాన పోలేదని వాపోయారు. విజయవాడ, విశాఖపట్నం మెట్రో రైల్ అడగలేదని, మదనపల్లి, బెంగళూరు రైల్వేలైన్ అమలు చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు. బిజెపి ప్రభుత్వంతో ప్రత్యక్ష పొత్తు ఉండేది ఒక్క వైసిపికేనని స్పెషల్ స్టేటస్‌పై ప్రతిసారి పవన్ కళ్యాణ్‌పై నిందలు వేయడం తగదని హితవు పలికారు. రాష్ట్ర రాజకీయాలలో మచ్చలేని నాయకుడు పవన్ కళ్యాణ్ మాత్రమేనని తెలిపారు. రాబోవు ఎన్నికలలో పవన్ కళ్యాణ్‌ని గెలిపించి ముఖ్యమంత్రిని చేసుకుంటే పార్టీని అధికారంలోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు మల్లిక, శోభ, రూప, సునీత, శ్రీనాథ్, గంగాధర, లక్ష్మీపతి, సోను, నాగేంద్ర, హర్ష దేవా పాల్గొన్నారు.

వైసిపి పాలనలో అరాచకమే తప్ప అభివృద్ధి లేదు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వైసిపి అధికారం చేపట్టిన తర్వాత ఈ నాలుగేళ్ల కాలంలో ఎపిలో అరాచకాలు ఎక్కువైపోయాయని, అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని మాజీ ఎమ్మెల్యే షాజహాన్ బాషా ఆరోపించారు. శనివారం స్థానిక బెంగళూరు బస్టాండులోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్కిల్ డెవలప్మెంట్ బోర్డులో అవినీతి జరిగిందని, ఇందులో చంద్రబాబు పాత్ర ఉందని ఇటీవల వైసిపి ప్రజాప్రతినిధులు ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నిజంగా అవినీతి జరిగి ఉంటే ఇంతకాలం ఎందుకు నోరు మెదపలేదని ప్రశ్నించారు. 108 నియోజకవర్గాల పరిధిలోని మూడు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో టిడిపి అభ్యర్థులు ఘనవిజయం సాధించడంతో వైసిపి నాయకులు అభద్రత భావంలో పడిపోయారన్నారు. పట్టభద్రులు రాష్ట్రంలో పూర్తిగా రాజకీయ మార్పును కోరుకుంటున్నారన్నారు. అధికార వైసిపి తమ తప్పులను కప్పిపుచ్చుకోవడానికి టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. వైసిపి నాయకులకు దౌర్జన్యాలు, భూకబ్జాలపై ఉండే శ్రద్ధ ప్రజాసమస్యలపై లేదని ఎద్దేవా చేశారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోయారని, ఇక్కడ ప్రజా ప్రతినిధులు చుట్టపుచూపుగా వచ్చి పోతున్నారే తప్ప,వారిని ఆదుకున్న పాపాన పోలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో లబ్ధి పొందడానికి అధికార పార్టీ కొత్త జిఒలను తీసుకొస్తోందన్నారు. అధికార పార్టీ ఎన్ని ఎత్తులు వేసినా ప్రజలు చిత్తు చేయడానికి సిద్ధంగా ఉన్నారని, 2024లో రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ జెండా రెపరెపలాడడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నాదెళ్ల శివకుమార్, భూమి సీడ్స్ రమణ, సంగం హరి, పఠాన్ ఖాదర్ ఖాన్, నాగూర్ వలి, గిరీష్, రఘుపతి నాయుడు, షంషీర్, హరి, వేమయ్య, వరుణ్, ఇంతియాజ్, బాలు, నాగమణి, రెడ్డి శేఖర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

బరితెగింపు!

ప్రజా'దృష్టి'

జిల్లాలోని ఇటీవలి ఘటనలు బరితెగింపును తలపించాయని చెప్పవచ్చు. ఇందులో జిల్లా పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ అచ్చెన్న హత్య ఒకటి. పులివెందుల యువకుల మధ్య చోటుచేసుకున్న ఘర్షణలో తుపాకీ కాల్పులు చోటుచేసుకోవడం మరొకటి. ఇందులో మొదటి ఘటనలో పశుసంవర్ధకశాఖ డిడి అచ్చెన్నను డిపార్టుమెంట్ ఉద్యోగులే కక్షగట్టి హత్య చేసిన తీరు విస్మయాన్ని కలిగించింది. ఆర్నెళ్లుగా పశుసంవర్ధక శాఖలో ఉద్యోగుల మధ్య నెలకొన్న విభేదాలు సీరియల్‌ను తలపించడం తెలిసిందే. ఉద్యోగుల మధ్య విభేదాలను తొలగించడానికి బదులు పెంచడానికి జిల్లా ఉన్నతాధికారులు దోహదం చేశారనే వాదన ఆందోళన కలిగిస్తోంది. ధర్నాలు, నిరసనల దశలోనే డిప్యూటేషన్ పేరుతో ముగ్గురు ఉద్యోగులను మూడు ప్రాంతాలకు పంపించి ఉంటే ఇటువంటి ఘటనకు దారితీసేది కాదనే వాదన వినిపిస్తోంది. తనను ముగ్గురు ఉద్యోగులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని అచ్చెన్న పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు అవసరమైన మేరకు భద్రతా పరమైన చర్యలు తీసుకోకపోవడం ఆందోళనకరం. జిల్లా అధికారుల వైఫల్యాలకు ఫలితం హత్య చోటుచేసుకోవడం, అనంతరం ఒక డిపార్టుమెంట్ ఉద్యోగిని ఎ-1 నిందితునిగా, అతనికి సహకరించిన ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేయడం, త్రిసభ్య కమిటీ విచారించడం, తాజాగా జాతీయ ఎస్‌సి కమిషన్ విచారణ పరిశీలనకు రావడంతో వ్యవహారం వేడెక్కింది. జిల్లా ఎస్‌పి మర్యాదపూర్వకంగా కలిసి కేసు పూర్వాపరాలను వివరించడం తెలిసిందే. అనంతరం అఖిలపక్ష సభ్యులు జాతీయ ఎస్‌సి కమిషన్‌ను కలిసి ఆందోళనలు నిర్వహించిన అనంతరం డిడి అచ్చెన్న హంతకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేయడం తెలిసిందే. జిల్లా, రాష్ట్ర ఉన్న తాధికారులను సకాలంలో స్పందించి ఉంటే ఇటువంటి దుర్ఘటనకు అవకాశం లేకుండా పోయి ఉండేది కాదేమో. ఇదిలాఉండగా పులివెందుల పట్టణంలో ముగ్గురు యువకుల మధ్య చోటుచేసుకున్న ఘర్షణ తుపాకీ కాల్పులకు దారితీయడం విస్మయాన్ని కలిగించింది. ముగ్గురు యువకుల మధ్య చోటుచేసుకున్న ఆర్థిక లావాదేవీలు కాల్పుల స్థాయికి చేరుకోవడం ఆందోళన కలిగించింది. యువతకు గన్‌లైసెన్సులు ఇవ్వడమే ఆందోళనకరం. యువదశలో ఉద్రేకాలు, ఉద్వే గాలు హెచ్చుస్థాయిలో ఉంటాయనేది అందరికీ తెలిసిందే. అటువంటి దశలోని యువకులకు గన్‌లైసెన్స్ ఇచ్చేసమయంలో ముందూ వెనకా ఆలోచించి ఉండాల్సి ఉంది. పైగా అతను ప్రముఖ రాజకీయ నాయకుడా, ఫ్యాక్షనిస్టా అంటే కాదు కదా, ప్రబలమైన శత్రువులు ఉండటానికి, అలాంటి యువకునికి గన్‌లైసెన్స్ ఇవ్వడంపై ఆలోచించాల్సి ఉంది. ఎవరి పరిస్థితి ఎలా ఉన్నా యువకులకు గన్ లైసెన్స్ మంజూరు చేయడంపై మరింత చర్చ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అందుకు నిరూపితమే తాజా ఘటన. ఇప్పటికైనా జిల్లా పోలీస్ యంత్రాంగం గన్‌లైసెన్సులు మంజూరు చేయడంలో మరింత విజ్ఞత, పారదర్శకతను పాటించాల్సిన అవసరం ఉందనడంలో సందేహం లేదు.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కమనీయం...శ్రీసీతారాముల కల్యాణం

ప్రజాశక్తి-వాల్మీకిపురం

జిల్లాలో ప్రసిద్ధి చెందిన వాల్మీకిక్షేత్రం శ్రీ పట్టాభిరామస్వామి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరవ రోజు శనివారం రాత్రి 8 గంటల నుంచి 10 గంటల వరకు ఆశ్లేష నక్షత్రంలో శ్రీ సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. సాధారణంగా అన్ని రామక్షేత్రాలలో శ్రీరామనవమి రోజున సీతారాముల కల్యాణం నిర్వహిస్తుంటారు. దేశంలో ఇందుకు భిన్నంగా వాల్మీకిపురంలో సీతమ్మవారు జన్మదినమైన ఆశ్లేష నక్షత్రంలో సీతారాముల కల్యాణం నిర్వహించడం ఇక్కడి విశేషం. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి మూలవర్లకు అభిషేకం, తోమాలసేవ, పంచాంగ శ్రవణం, అర్చన, కొలువు, బలి, శాత్తుమొర, ఉదయం తిరుచ్చిలో స్వామివార్లకు అలంకరణ, అనంతరం తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. 10 గంటల నుంచి స్నపన తిరుమంజనంకు విచ్చేసిన భక్తులు స్నపన తిరుమంజనం తిలకించి తన్మయత్వం చెందారు. సాయంత్రం ఊంజల మండపంలో స్వామివారికి ఊంజల్ సేవ శాస్త్రోక్తంగా నిర్వహించారు. నూతన వధూవరులైన సీతారాములకు పట్టుపీతాంబరాలు, విశేషాభరణాలతో సుందరంగా అలంకరించారు. అనంతరం స్వామివారికి రాత్రి 8 గంటల నుంచి 10 గంటల వరకు పట్టణ పరిధి తోటవీధిలోని టిటిడి స్థలంలో ఆరుబయట ఏర్పాటు చేసిన అతిసుందరంగా అలంకరించిన కల్యాణ వేదికపై వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ ఆర్జిత కల్యాణోత్సవ దంపతులు ఆశీనులై తిలకిస్తుండగా సీతారాముల కల్యాణ మహోత్సవం కన్నులపండువగా జరిగింది. సీతారాములు ముత్యపు తలంబ్రాలతో తడిసి ముద్దయ్యారు. సీతాలక్ష్మణ సమేత శ్రీరామచంద్రులవారిని అలంకరించి ఆస్థానం నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి కల్యాణోత్సవానికి వేలాది మంది భక్తులు రావడంతో తోటవీధి కిక్కిరిసింది. ఆర్జిత కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులకు నూతన వస్త్రం, ప్రసాదాలను అందజేశారు. రాత్రి 11 గంటలకు తనప్రియమైన గరుడ వాహనంపై సీతాలక్ష్మణ సమేత శ్రీరామచంద్రమూర్తి తిరుమాడవీధుల్లో విహరించి భక్తులను కటాక్షించారు. భక్తులకు స్థానికుడు దశరథ రామవంశి బెల్లంపానం, వడపప్పు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

ప్రాంగణ ఎంపికల్లో 13 మందికి ఉద్యోగాలు

మదనపల్లె అర్బన్: ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన ప్రాంగణ ఎంపికలో 13 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్ రామలింగారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ బెంగళూరుకు చెందిన ట్యాప్ అకాడమీ సంస్థ నిర్వహించిన సెలెక్షన్స్‌లో తమ విద్యార్థులు ప్రతిభ చూపారన్నారు. ఎంపికైన విద్యార్థులకు సంవత్సరానికి రూ.నాలుగు లక్షల ప్యాకేజీ ఇవ్వనున్నారన్నారు. ఎంపికైన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.సతీష్ బాబు, టిపిఒ మనోజ్ కుమార్, ప్లేస్మెంట్ కో-ఆర్డినేటర్ లోకేష్, ముని కుమార్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొని విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. **పీలేరులో....**ఎంజెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం జరిగిన ప్రాంగణ ఎంపికలో 13 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక అయ్యారని కళాశాల ఛైర్మన్ ఎంపి అవినాష్ కుమార్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.సుధాకర్‌రెడ్డి తెలిపారు. టాప్ ఆకాడమీ ఆధ్యర్యంలో కంపెనీ హెచ్‌ఆర్ సుఫియాన్ ఖాన్ పర్యవేక్షణలో ప్రాంగణ ఎంపికలో భాగంగా నిర్వహించిన రాత పరీక్షకు 125 మంది విద్యార్థు హాజరు కాగా వారిలో 27 మంది విద్యార్థులు అర్హత సాధించారని పేర్కొన్నారు. అనంతరం జరిగిన గ్రూప్ డిస్కషన్స్, హెచ్‌ఆర్ ఇంటర్వ్యూలో 13 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని చెప్పారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులనేను కళాశాల ఛైర్మన్, ప్రిన్సిపల్ అభివందించారు. ఈ కార్యక్రమంలో ప్లేస్మెంట్ ఇన్‌చార్జి రెడ్డి ఖాసీం, డాక్టర్ సత్యరాజ్ పాల్గొన్నారు.

పీలేరు : ఉద్యోగాలు పొందిన విద్యార్థులు

ఎంపీ మిథున్‌రెడ్డిని కలసిన మండల నాయకులు

ఎంపీని కలిసిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

నియోజకవర్గం పర్యటనకు విచ్చేసిన రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డిలకు శనివారం బయ్యప్పగారిపల్లి పంచాయతీ మొగసాలమర్రిలో వైసిపి నాయకులు కార్యకర్తలు కలిశారు. మదనపల్లిలోని ఎంపీ కార్యాలయం విచ్చేసిన సందర్భంగా గట్టు మాజీ సర్పంచ్ మీయాసాబ్ ఆధ్వర్యంలో గట్టు ముస్లిం స్మశానవాటికకు ప్రహరీ గోడ మంజూరు చేయాలని వినతి పత్రం అందించారు. ఎంపీ సానుకూలంగా స్పందించి మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారని వారు తెలిపారు. ఎంపిటిసి రామసుబ్బారెడ్డి నివాసాని వచ్చిన ఎంపీని మాజీ ఎంపిపి ఖలీల్ అహ్మద్, సిఆర్ చిన్నికృష్ణ, భీమగాని ప్రభాకర్ రెడ్డి, కంచి బలరాంరెడ్డి, గట్లమీద నరసింహనాయుడు, చిన్నపరెడ్డి, కమ్మలపల్లి శంకర్ రెడ్డి, నరసింహనాయుడు, ప్రత్యేకంగా కలిశారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి రామచంద్ర యాదవ్, సర్పంచ్ రామ్మోహన, గట్టు సచివాలయం కన్వీనర్ యస్.సికిందర్ బాషా, మీడియా కో-కన్వీనర్ యస్.తన్వీర్ గట్టు మస్జీద్ కమిటీ సభ్యులు నజీర్, చాంద్‌బాషా, సభిరుల్ల, అస్లం, వైసిపి యూత్ అరిఫ్, సూహెల్, సయాద్ బాషాలు కలిసి వినతి పత్రం అందించారు.

ప్రయివేట్ పాఠశాలల్లో ఉచిత సీట్లకు నోటిఫికేషన్

ప్రజాశక్తి-కంభంవారిపల్లి

ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం కింద ప్రయివేట్ పాఠశాలలో పేద పిల్లల ప్రవేశాలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. 2023-24 విద్యాసంవత్సరంలో 1వ తరగతిలో 25 శాతం సీట్లకు ప్రవేశాలకు సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 10న ముగియనున్నట్లు ఎంఇఒ పి.రెడ్డి భాష ఒక ప్రకటనలో వెల్లడించారు. ఆన్‌లైన్‌లో ఏప్రిల్ 7 లోగా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. మండలంలో వున్న ఏకైక ప్రయివేట్ పాఠశాలలో 1 వ తరగతి లో సీట్ల కోసం అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అనాథపిల్లలు, హెచ్ఐవి బాధితులకు, వికలాంగులకు 5 శాతం, ఎస్‌సిలకు10 శాతం, ఎస్‌టిలకు 4 శాతం, బిసి, మైనార్టీ, ఒసిలకు 6శాతం సీట్లు కేటాయించినట్లు తెలిపారు. వివరాలకు ఎంఇఒ కార్యాలయంలో డెస్క్ నంబరు 94909 32556 ను గానీ, గ్రామ సచివాలయం లోని వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ను సంప్రదించవచ్చని సూచించారు. **నిమ్మనపల్లి:** ప్రయివేట్ పాఠశాలలో ఒకటవ తరగతిలో విద్యార్థుల ప్రవేశాల కొరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి రాజగోపాల్ తెలిపారు. మండలంలోని బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ, అగ్రవర్ణ వర్గాలకు చెందిన తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రయివేట్ యాజమాన్యం పాఠశాలలో చేర్పించడానికి ఈ నెల 7వ తేదీ లోపల తమ పిల్లల పేర్లు సిఎస్ లాగిన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. అర్హత కలిగిన పిల్లలను 13న తేదీన మొదటి విడత ఎంపిక చేస్తారన్నారు. రెండవ విడత లాటరీ 29న నిర్వహిస్తామని తెలిపారు. లాటరీ ద్వారా ఎంపికైన విద్యార్థులు మే 1వ తేది నుంచి 5వ తేది లోపు పాఠశాలలో చేరాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో రూ.1,20 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో 1.44లక్షలు మించకూడదని అన్నారు. తల్లిదండ్రులు యాజమాన్య పాఠశాలలో తమ పిల్లలను ఒకటవ తరగతిలో చేర్పించుటకు సిసి లాగిన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకొని సద్వినియోగం చేసుకోవాలని ఎంఇఒ తెలిపారు.

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తే ముఖ్యం

ప్రజాశక్తి-కలికిరి

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తే ఉపాధ్యాయులకు ముఖ్యమని బయాలజీ ఉపాధ్యాయురాలు అరుంధతి తెలిపారు. జడ్‌పిహెచ్ఎస్ చదివేవాండ్లపల్లి ఇంద్రమ్మ కాలనీ స్కూల్లో పనిచేస్తున్న బయాలజీ టీచర్ ఎవి.అరుంధతి తన సొంత నిధులతో విద్యార్థులకు జామెంట్రీ బాక్సులు, ఉపాధ్యాయుడు జగన్మోహన్ పెన్నులు, విద్యా సామగ్రిని పదవ తరగతి విద్యార్థులకు వితరణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాగా చదువుకునే పేద విద్యార్థులు ఆర్థిక స్తోమత లేక ఉన్నత చదువులు చదవలేక చదువులకు దూరం అవుతున్నారని, అలాంటి వారిని గుర్తించి దాతలు ఆర్థిక సహాయం చేస్తే వారు మరింత ముందుకు వెళ్ళడానికి అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సంపత్, ప్రకాష్, పదో తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టిబి రోగులకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న వైద్యులు

క్షయ వ్యాధిగ్రస్తులను ఆదరించండి

ప్రజాశక్తి-కలకడ

క్షయ వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకొని ఆదరించాలని వైద్యాధికారి మోహన్ తెలిపారు. కలకడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని పరిధిలో ఉన్న నలుగురు క్షయ వ్యాధిగ్రస్తులను, ఫార్మసీ అండ్ డ్రగ్గిస్ట్ సంఘం తరపున నలుగురికి 6 నెలల దత్తతతీసుకొని పౌష్టికాహారాన్ని అందించామన్నారు. ప్రధాన మంత్రి టిబి ముక్త్ భారత్ పోషన్ మిత్ర కార్యక్రమంలో భాగంగా కలకడ ఫార్మసీ అండ్ డ్రగ్గిస్ట్ సంఘం అధ్యక్షుడు నాగరాజు ఆధ్వర్యం లో నలుగురు టిబి వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం కిట్లను అందించామన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు క్షయ వ్యాధి నివారణకు అనేక కార్యక్రమాలు చేపడుతోందని, దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలలో పలు స్వచ్ఛంద సంస్థలు కూడా వారి వంతు కృషి చేస్తున్నారని అన్నారు. పౌష్టికాహారంతో పాటు మందులను కూడా క్రమం తప్పకుండా తీసుకున్నట్లయితే ఆరు నెలలకే క్షయ వ్యాధి పూర్తిగా తగ్గిపోతుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో మోహన్ టిబి యూనిట్ వైద్య సిబ్బంది ఎంపిహెచ్ఎస్ మురళి, సీనియర్ ట్రీట్మెంట్ సూపర్వైజర్ వెంకటేసు, వెంకటేశ్వర రావు స్టాఫ్‌నర్స్ భాగ్య, పెంచలయ్య, అరుణకుమారి ల్యాబ్‌టెక్నీషియన్ హాజీర, సంఘం సభ్యులు కోటరమణ, సలీమ్, గురునాథం, జయచంద్ర, ప్రసాద్, సురేష్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలోని వంగిమల పంచాయతీ సచివాలయం దగ్గర వేసవి తాపాన్ని పట్టుకునే విధంగా చల్లని నీటి చలివేంద్రం శనివారం సర్పంచ్ సరస్వతమ్మ, పంచాయతీ సెక్రటరీ గౌస్‌పీర్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవికాలం పూర్తిస్థాయిలో ఉందని, సూర్య ప్రతాపానికి వాతావరణం 42 డిగ్రీల ఉష్ణోగ్రతను తలపిస్తుందని అన్నారు. పాదచారులకు, యాత్రీకులకు ఆసరాగా చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రతి ఒక్కరు రోజుకు నాలుగు నుంచి ఐదు లీటర్లు మంచినీటిని తాగాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ గౌస్‌పీర్, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభిస్తున్న సర్పంచ్ సరస్వతమ్మ

దోపిడీ రాజ్యం పోవాలి : ఆర్ఆర్

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

దోపిడీ రాజ్యం పోవాలిపేదవాడి రాజ్యం రావాలని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని కస్తురాజుగారిపల్లె పంచాయితీ లో చాగలగుట్టపల్లె, గంధంవాండ్లపల్లె, దేవలంపల్లె, కస్తురాజుగారిపల్లె, హరిజనవాడ, గురవయ్యగారిపల్లెలో నిర్వహించిన ఇదేంఖర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం దోపిడీ రాజ్యాంగ మారిందని ప్రజలు పేదవాడి రాజ్యం కోసం టిడిపిని గెలిపించాలని ప్రజలను కోరారు. పేదవాడి ఆకలి గుర్తించి రెండు రూపాయల కిలో బియ్యం పథకాన్ని, ఆడపడుచులకు సమాన హక్కు కల్పించిన ఘనత టిడిపిదేనని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం పది రూపాయలు ఇచ్చి యాభై రూపాయలు దోచుకుంటుందని అన్నారు. గాలికి వచ్చిన పార్టీ గాలికే పోతుందని అన్నారు. పల్లెల్లో, పట్టణాల్లో అభివృద్ధి పనులు ఎక్కడ జరగలేదన్నారు. ప్రజల నుంచి ఎన్నుకోబడిన సర్పంచులు, ఎంపిటిసిలు, జడ్‌పిటిసిలు ఉత్సవ విగ్రహాలుగా ఉన్నారని, వీరి నిధులు కూడా దారి మళ్లించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి మాజీ మార్కెట్ చైర్మన్ కలాడి ప్రభాకర్ రెడ్డి, బడుగు వాసుదేవుడు, పాపయ్య, సుధీర్, సిద్ధక వెంకట్రామిరెడ్డి, బిసిసెల్ రాష్ట్ర కార్యదర్శి జయరామ, వెంకట్రామిరెడ్డి, సర్పంచ్ కేశవయ్య, గంగయ్య, అజంతుళ్ళ, డాక్టర్ షఫీనాయక్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇదేంఖర్మ కార్యక్రమంలో రమేష్ కుమార్ రెడ్డి

మహిళా సాధికారతే సిఎం ధ్యేయం : ఎమ్మెల్యే

ఆసరా చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-కలకడ

మహిళా సాధికారతే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని బాటవారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (తెలుగు)లో నిర్వహించిన వైఎస్ఆర్ ఆసరా చెక్కులు పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న మహిళలు అన్ని రంగాలలో రాణించాలన్న ఉద్దేశంతో సిఎం మహిళలకు ఎనలేని ప్రాముఖ్యతను ఇస్తున్నారని అన్నారు. ప్రతి మహిళ ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందాలన్నా ఉద్దేశంతో ముఖ్యమంత్రి మహిళలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. రానున్న ఎన్నికలలో ముఖ్యమంత్రి ప్రజలకు చేస్తున్న సేవలను గుర్తించి ఓట్లు వేయడం జరుగుతుందని ఎంపిపి శ్రీదేవి రవికుమార్ తెలిపారు. అభివృద్ధిని చూసి ఓట్లు వేయాలని మార్కెటింగ్ కమిటీ చైర్మన్ బరకం రవికుమార్ రెడ్డి మహిళలను కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజగోపాల్ రెడ్డి, ఎంపిటిసి కృష్ణారెడ్డి, చైర్మన్ కమలాకర్ రెడ్డి, నాయకులు మోహన్ రాజనాయుడు, సురేష్ నాయక్, శావత్ అలీఖాన్, ఈ నయాతుల్లా, వట్టం మధుసూదన్ రెడ్డి, కిషోర్ కుమార్, తహశీల్దార్ రాము, ఎంపిడిఒ సిహెచ్ నారాయణ, రీజనల్ కో-ఆర్డినేటర్ రూతు, ఎపిఎం రమేష్, ఎస్ఐ తిప్పేస్వామి, పోలీసులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పోతువారిపల్లెలో గడప గడపకూ..

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో పోతువారిపల్లిలో నిర్వహించబడింది. మండలంలోని బాటవారిపల్లి పంచాయతీ రంగనాథపురం పోతువారిపల్లి గ్రామాలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెడుతున్న అభివృద్ధి పథకాలను ప్రజలు గుర్తించాలని వారికి ప్రజాసంక్షేమ పథకాలను గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపిపి శ్రీదేవి రవికుమార్, కలికిరి మార్కెటింగ్ యార్డ్ కమిటీ చైర్మన్ రవికుమార్‌రెడ్డి, సర్పంచులు, సచివాలయ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు ఏర్పాట్లు సిద్ధం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

ఈనెల 3 నుంచి జరగనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసినట్లు ఎంఇఒ రాజగోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో సోమవారం నుంచి పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు జరుగునున్న నేపథ్యంలో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేయడం జరిగిందన్నారు. మండలంలో నిమ్మనపల్లి జడ్‌పి హైస్కూల్ (తెలుగు) మాత్రమే పరీక్షా కేంద్రంగా ఉందన్నారు. మొత్తం 340 మంది విద్యార్థులు పరీక్షల్లో పాల్గొననున్నట్లు వివరించారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లను ఇప్పటికే సిద్ధం చేసినట్లు చెప్పారు. పరీక్ష ఉదయం 9:30 గంటల నుంచి12:45 గంటల వరకు జరుగుతుందన్నారు. పదవ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు తమ హాల్ టికెట్ తో పాటు, పరీక్షా సమయానికి అరగంట ముందుగా పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని అన్నారు. ఆలస్యమైతే విద్యార్థులను లోపలకు అనుమతించరని స్పష్టం చేశారు. **కలకడ:** పదవ తరగతి విద్యార్థులు పరీక్షలను నిర్భయంగా రాయాలని ప్రధానోపాధ్యాయురాలు సరస్వతి తెలిపారు. శనివారం మండలంలోని బాటవారిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (తెలుగు)లో విద్యార్థుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పరీక్షలు రాయడం అలవాటు పడిన విషయమేనని దీనికి ఏమాత్రం భయపడకుండా పరీక్షలను రాయాలని సూచించారు. పరీక్షలు రాసే టైంలో ఎలాంటి ఒత్తిడి లకు గురికాకుండా, మీరు చదివిన సమాధానాలను నిర్భయంగా నిక్కచ్చిగా రాయడం నేర్చుకుని భయపడకుండా పరీక్షలు రాయాలని సూచించారు. మొదట బాగా వచ్చిన ప్రశ్నలకు సమాధానం రాసి, తర్వాత రాని వాటిని గుర్తుకు తెచ్చుకుని సమాధానం రాయాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు. **కంభంవారిపల్లి :** మండలం లోని మూడు సెంటర్లలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఎంఇఒ పి.రెడ్డి భాష తెలిపారు. ఈ నెల 3 నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు మొత్తం 501 మంది విద్యార్థులు రాయనున్నారని, మండలం లోని మూడు సెంటర్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్, గురుకుల పాఠశాలలో పరీక్షలు పకడ్బందీ నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. చీఫ్ సూపరిండెంట్లు శ్రీరామ్మూర్తి , సురేంద్ర, రెడ్డప్ప, డిపార్ట్మెంట్ ఆఫీసర్లు గోవర్థన్, వెంకట్రమణ, రమేష్‌తో కలిసి మూడు సెంటర్లకు కేటాయించిన ఇన్విజిలేటర్‌లకు పరీక్షల నిర్వహణపై అవగాహన కల్పించారు. **పెద్దమండ్యం :** స్థానికంగా మండలం పెద్దమండెం, కలిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు ఎంఇఒ పి.మనోహర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెంటర్లలో మంచినీరు, బల్లలు, వెలుతురు, విద్యుత్ సౌకర్యాలు, కల్పించినట్లు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరగడానికి కావలసిన సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో చీఫ్ సూపర్నిండెంట్లు చంద్రనాయక్ త్రినాథరావు, ప్రధానోపాధ్యాయులు ఖధీరుల్లఖాన్, భారతి, చంద్రశేఖర్ సోమశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. **గాలివీడు :** పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే ఇన్విజిలేటర్లు తమ సెల్‌ఫోన్లను ఇంటి వద్దనే ఉంచి రావాలని బాలికల ఉన్నత పాఠశాల చీఫ్ ఒ.నిర్మల పేర్కొన్నారు. శనివారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాల ఆవరణంలో కెజిబివి బాలికల ఉన్నత పాఠశాల స్కూల్లో ఇన్విజిలేటర్లు సమావేశం ఏర్పాటు చేశారు. పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇన్విజిలేటర్లు పరీక్షల నిర్వహణలో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో చీఫ్ సుధాకర్ డిఒ వసుంధర ఇన్విజిలేటర్లు హరి, జయన్న, ఆదినారాయణ పాల్గొన్నారు.

కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న పండితులు

వైభవంగా రాములోరి కల్యాణం

ప్రజాశక్తి-కలకడ

శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకొని సంబేపల్లి మండలం బావులకాడపల్లిలో సీతారాముల కల్యాణోత్సవాన్ని మద్దిపట్ల రాజశేఖర్ నాయుడు దంపతులు ఘనంగా నిర్వహించారు. వేద పండితుల మధ్య హోమం నిర్వహించి, మేళతాళాలు, ముత్యాల తలంబ్రాలతో కనుల పండువగా నిర్వహించారు. **కలికిరి :** మండలంలోని గుట్ట పాలెం పంచాయితీ కె.బర్నేపల్లిలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిపించారు. కల్యాణం అనంతరం గ్రామంలో ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం 7 నుంచి చుట్టుపక్కల ప్రజలు, అక్కడికి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు రామకోటి నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. **పుల్లంపేట:** పుల్లంపేట మండలం అనంతంపల్లి గ్రామంలో దేసు ఈశ్వరయ్య , విజయలక్ష్మి కుమారుడు దేసు ప్రకాష్ రెడ్డి హరిత దంపతులు ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వేద పండితులు శివశర్మ ఆధ్వర్యంలో మంత్రోచ్చరణలు మధ్య కమనీయం రమణీయంగా నిర్వహించారు. కళ్యాణ వేదికను పూలతో సుందరంగా అలంకరించి సీతారామ లక్ష్మణ హనుమంతు ఉత్సవ విగ్రహాలను కొలువు తీర్చి కళ్యాణ తంతును కమనీయంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండల సచివాలయాల కన్వీనర్, మాజీ సర్పంచ్ నాగిరెడ్డి హరినాథ్ రెడ్డి, వల్లూరు ప్రవీణ్ కుమార్ రెడ్డి, పోత్తపి అశోక్‌రెడ్డి, దేసు నారాయణరెడ్డి, నారపు రెడ్డి అచ్యుత్ రెడ్డి, శివ సాయిరెడ్డి, మధుకర్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, మహేష్‌రెడ్డి కుటుంబ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** మండలంలోని గంగన్నగారిపల్లిలో ఆధ్వర్యంలో గ్రామంలోని రామాలయంలో ఘనంగా రామకోటి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నిర్వహించే శ్రీరామనవమి వేడుకలలో భాగంగా తమ గ్రామ ప్రజలందరూ రామకోటి కార్యక్రమంలో పాల్గొనాలని అన్నారు. రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని స్వామివారిని వేడుకున్నట్లు వారు తెలిపారు. ప్రతి సంవత్సరం ఈ రామకోటి కార్యక్రమాన్ని నిర్వహించడం పరిపాటిగా వస్తోందని వారు అన్నారు

కనులపండువగా ద్రౌపది కల్యాణం

కలకడ : ద్రౌపది కళ్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. మండలంలోని బాలయ్య గారి పల్లి పంచాయతీ ఎర్రయ్యగారిపల్లి సమీపంలో ఉన్న దేవనంపేటలోని శ్రీ కామాక్షి సమేత సిద్దేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న మహాభారత యజ్ఞంలో భాగంగా ద్రౌపతి కళ్యాణాన్ని నిర్వహించారు. పాపి రెడ్డి గారి పల్లి మహిళా పోలీసు సుజాత దంపతులు ద్రౌపది కళ్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారుజ భక్తులకు వెంకటరమణ, శ్రీనివాసులు, లక్ష్మన్నలు కలిసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

4న ప్రయివేట్ బస్టాండుకు వేలం

బి.కొత్తకోట: నగర పంచాయతీకి సంబంధించి ప్రయివేట్ బస్టాండ్ కు2023-24 ఆర్థిక సంవత్సరానికి నగర పంచాయతీ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో ఈ నెల 4న మంగళవారం సాయంత్రం 4 గంటలకు బహిరంగవేలం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ నరసింహ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా నాగమల్లిరెడ్డి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా నాగమల్లి రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కోర్టు ఆవరణలో శుక్రవారం సాయంత్రం సీనియర్ న్యాయవాది అసాన్‌వల్లి ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. అధ్యక్షులుగా బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా నాగమల్లిరెడ్డి, ఉపాధ్యక్షులుగా పి.వెంకటరమణ, జనరల్ సెక్రెటరీగా శ్రీనివాసులు, జాయింట్ సెక్రెటరీ శంకర్, నాయకులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యలను పరిష్కరించేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు.

గర్భిణులు, పిల్లలకు సకాలంలో టీకాలు

ప్రజాశక్తి-ములకలచెరువు

గర్భిణులు, చిన్నపిల్లలకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు అందించాలని జిల్లా వ్యాధి నిరోధిక టీకాల అధికారిని ఉషశ్రీ సూచించారు. శనివారం ఆమె స్థానిక పిహెచ్‌సి, అంగన్వాడీ కేంద్రం, పెద్దపాళ్యం అంగన్వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక పిహెచ్‌సిలో వ్యాధి నిరోధిక టీకాల నిల్వ చేయు గదిని పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. వేసవి కాలం కావడంతో ప్రజలకు వడదెబ్బపై అవగాహన కల్పించాలన్నారు. వడదెబ్బకు తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలపై ఆరా తీశారు. కార్యక్రమంలో డాక్టర్ లోకేష్, సిహెచ్ నారాయణ, షకీలాభేగం, ఎంపిహెచ్ఒ బివి రమణయ్య, సూపర్వైజర్ అమరావతి, ఎఎన్ఎం సరస్వతి ఆశలు అమరావతి, లక్ష్మి పాల్గొన్నారు.

వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న ఉషశ్రీ

పిరమిడ్ విన్యాసాలు చేస్తున్న స్కౌట్ విద్యార్థులు

హార్సిలీహిల్స్‌లో 'కబ్స్ అడ్వెంచర్ ఫెస్ట్'

ప్రజాశక్తి-బి.కొత్తకోట

చిన్నారులలో ధైర్యసాహసాలు పెంపొందించడమే లక్ష్యంగా స్కౌట్ కబ్స్ మాస్టర్లు పనిచేయాలని మదనపల్లి డిప్యూటీ డిఇఒ కృష్ణప్ప కోరారు. హార్సిలీహిల్స్‌లో ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో శనివారం స్కౌట్ కబ్స్ విద్యార్థులకు నిర్వహించిన అడ్వెంచర్ ఫెస్ట్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాహస కృత్యాలతో పాటు అగ్ని ప్రమాదాలు, భూకంపాలు, తుఫానులు వంటి విపత్కర పరిస్థితుల నుంచి ఎలా బయటపడాలి, తెలియని ప్రదేశంలో మనుగడ ఎలా సాధించాలి అనే విషయాలను శిక్షణలో విద్యార్థులకు తెలియజేయాలన్నారు. తల్లిదండ్రులు, గురువులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ సమాజం పట్ల బాధ్యతగా ఉండాలన్నారు. గోల్డెన్ యారో అవార్డు పొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందించారు. ఈ సందర్భంగా స్కౌట్ విద్యార్థులు ప్రదర్శించిన పిరమిడ్ విన్యాసాలు, తాడు సహాయంతో చెట్లను ఎక్కడం వంటి సాహస కృత్యాలను ఆకర్షించాయి. కార్యక్రమంలో విద్యార్థులతో స్కౌట్స్ అండ్ గైడ్స్ సెక్రెటరీ మడితాటి నరసింహారెడ్డి, ఎంఇఒ ప్రభాకర్ రెడ్డి, డిస్టిక్ ట్రైనింగ్ కమిషనర్ భాస్కర్ రెడ్డి, కబ్ మాస్టర్లు పాల్గొన్నారు.

'అన్నదాతలకు సన్మానం'

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఎపి బిసి హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బోడెం రాజశేఖర్ జన్మదిన వేడుకలు శనివారం పట్టణంలోని నీరుగుట్టువారిపల్లి టమోటో మార్కెట్ యార్డ్‌లో అన్నదాతల సమక్షంలో జరిగాయి. ఈ సందర్భంగా అన్నదాతలను ఘనంగా సన్మానించి వారికి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా బోడెం రాజశేఖర్ మాట్లాడుతూ దేశానికి అన్నం పెట్టే రైతన్నను మనం గౌరవించుకోవాలని, వారి సమక్షంలో పుట్టినరోజు వేడుకలను జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. సమాజ్‌వాది పార్టీ ఉత్తరాంధ్ర ఇన్‌ఛార్జి డాక్టర్ నమ్మి అప్పలరాజుయాదవ్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం బోడెం రాజశేఖరయాదవ్ అలుపెరుగని కృషి చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ఎపిబిసిహెచ్ పిఎస్ కార్యవర్గ సభ్యులు రామలింగయ్య, బండిరామచంద్ర, మణిశంకర్, రామకృష్ణ, డాక్టర్ మంజు, సుబ్బరాజు, నాగినేని గోవిందు, రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఉమ్మడి చిత్తూరు అన్నమయ్య జిల్లా కార్యదర్శి లక్ష్మన్న శంకర వెంకటరమణ, చలపతి, కృష్ణారెడ్డి, రాజా, సోము, కృష్ణమూర్తి, హరినాథ్, గురుమూర్తి, వెంకటరమణ, శ్రీనివాసులు,రాజు, చంద్రయ్య, గంపల గంగరాజు, పుంగనూరుకు చెందిన మునిరామయ్య పాల్గొన్నారు.

ఇస్కాన్ ద్వారా విద్యార్థులకు భోజనాలు

ప్రజాశక్తి-కలకడ

మండలంలో అన్ని పాఠశాలలకు ఇస్కాన్ వారి ఆధ్వర్యంలో భోజనాలను పంపిణీ చేశారు. ఈ పద్ధతి ద్వారా శనివారం నుండి భోజనాలు పంపిణీ చేయడం మొదలు పెట్టారని ప్రధానోపాధ్యాయులు సరస్వతి తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మెనూ ప్రకారం భోజనాల సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పులిహోర, కేసరి, సాంబారు, రసంను విద్యార్థులకు వడ్డించినట్లు తెలిపారు.

సూక్ష్మ నీటి పారుదలతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి-కలికిరి

సూక్ష్మ నీటి పారుదల పద్ధతులతో నీటి ఆదా, అధిక దిగుబడి కలుగుతుందని కెవికె కో-ఆర్డినేటర్ డాక్టర్ పాండురంగ తెలిపారు. శనివారం కలికిరి కృషి విజ్ఞానకేంద్రంలో పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ఆర్థిక సహకారంతో సూక్ష్మ నీటిపారుదల పద్ధతుల ప్రాముఖ్యతను గూర్చి వివరించారు. తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్త డాక్టర్ కె.మధు సూదనా రెడ్డి "డిజైన్ అండ్ మెయింటెనెన్స్ ఆఫ్ మైక్రో ఇరిగేషన్' గురించి, వివిధ సూక్ష్మ నీటిపారుదల పద్ధతుల గురించి పేర్కొన్నారు. డ్రిప్ ఇరిగేషన్ వలన టమెటా, అరటి, బొప్పాయి వివిధ పంటల్లో అధిక దిగుబడి గురించి తెలిపారు. పంటలు, నేలల్లో డ్రిప్ పైపులు అమర్చవలసిన దూరం గురించి చెప్పారు. వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. అంకయ్య కుమార్ మాట్లాడుతూ డ్రిప్పు ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఎస్.మధుబాబు, డ్వామా అందిస్తున్న వివిధ పథకాల గురించి తెలిపారు. కార్యక్రమంలో రైతులు ఉద్యాన, పాలిటెక్నిక్ విద్యార్థులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

చిరుధాన్యాల వినియోగంపై అవగాహన కల్పిస్తున్న ఎంపిడిఒ

చిరుధాన్యాలతో ఆరోగ్య ప్రయోజనాలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

ఆరోగ్యకరమైన జీవన విధానంలో చిరుధాన్యాలు చాలా ప్రాముఖ్యత కలిగినవని, వాటిని తరచూ ఆహారంగా తీసుకోవడం వలన శరీరానికి పోషకాల రూపంలో అనేక లాభాలను చేకూరుస్తాయని ఎంపిడిఒ లీలా మాధవి అన్నారు. శనివారం మండల సమాఖ్య కార్యాలయం నందు జాతీయ గ్రామీణ జీవనోపాదుల సంస్థ ఆధ్వర్యంలో నిమ్మనపల్లి రైతు ఉత్పత్తిదారుల సంస్థ నిర్వహించిన మిల్లెట్ ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమంలో ఎపిఎం రజినికుమారితో కలిసి పాల్గొన్నారు. చిరుధాన్యాలతో చేసిన వివిధ ఆహార పదార్థాలు వంటలు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవుని ఆరోగ్యంలో చిరుధాన్యాలు చాలా ముఖ్యమైనవని అన్నారు. చిరుధాన్యాలను ఆహా రూపంలో తీసుకోవడం వలన వాటిలోని పోషక విలువలు అనారోగ్య సమస్యల నుంచి కాపాడుతాయని తెలిపారు. ఐక్యరాజ్యసమితి 2023-24 సంవత్సరాన్ని గ్లోబల్ ఇయర్ ఆఫ్ మిల్లెట్ గా ప్రకటించిందన్నారు. రైతులు చిరుధాన్యాల సాగుపై ఆసక్తి చూపాలని పిలుపునిచ్చారు. చిరుధాన్యాల సాగుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని అన్నారు. కార్యక్రమంలో సిహెచ్ఒ మల్లిక, పంచాయతీ కార్యదర్శులు గిరిధర్ నాయక్, మారప్ప, ఎఎన్ఎంలు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని ఆదర్శ పాఠశాల సమీపంలో శనివారం సిరి కుంట్ల నరసింహులు(52) అనే వ్యక్తి బైక్ అదుపుతప్పి మృతి చెందాడు. నరసింహులు సొంత గ్రామం పుల్లంపేట మండలం అప్పయ్య రాజుపేట గ్రామం. వివరాల్లోకి వెళితే.. మృతుడు తన కొడుకు శివ క్రిష్ణకుమార్‌తో కలసి బైక్ రిపేరు కోసం కొడుకు బైకుకి తాడు కట్టి రాజంపేటకు తీసుకు వెళుతున్న సమయంలో ప్రమాదం జరిగింది. వెనుక నుంచి ఎవరో పిలిచినట్టు వినపడటంతో వెనక్కి తిరిగి చూసిన వెంటనే తాడు తెగిపోయి కొడుకు కళ్ళ ముందరే తల పగిలి విపరీతమైన రక్తస్రావం జరిగి అక్కడికక్కడే నరసింహులు మృతి చెందాడు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడి కుటుంబ సభ్యులకు గ్రామస్తులు సానుభూతి వ్యక్తం చేశారు. ఈ ఘటన పై పోలీసులు విచారించి కేసు నమోదు చేశారు. ఇలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా తలకు హెల్మెట్‌ను ధరించాలని సూచించారు.